

విచారణ అనంతరం ఈడీ కార్యాలయం బయట మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు

లైడిటెక్టర్ పరీక్షకు సిద్ధమా?

మొదటిపేజీ తరువాయి...

కార్యాలయానికి చేరుకున్నారు. సాయంత్రం 6.35 గంటల తర్వాత కార్యాలయం నుంచి బయటకు వచ్చారు. సుమారు 8 గంటల విచారణ అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని, చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా తాను ఈడీ విచారణకు వచ్చానని, రాజకీయ వేధింపు, కక్ష సాధింపు చర్యల్లో భాగంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తన మీద అక్రమ కేసు పెట్టిందని చెప్పారు. విచారణ అధికారులు, విచారణ సంస్థలను గౌరవించి మొన్న 9వ తేదీన ఏసీబీ విచారణకు హాజరయ్యానని, ఏసీబీ కేసు పెట్టింది కాబట్టి 16న ఈడీ విచారణకు రమ్మని పిలిస్తే ఈడీ విచారణకు కూడా హాజరయ్యానని తెలిపారు. ఆ రెండు సంస్థలు కూడా ఒకే రకమైన ప్రశ్నలను ఏడు నుంచి 8 గంటల పాటు అడిగిందే అడిగి వివరాలు తీసుకున్నాయని చెప్పారు.

ఇన్ని కోట్ల ప్రజాధనం వృథా ఎందుకు?

ఇంతమంది నాయకులు, విచారణ సంస్థలతో మొత్తం రూ.5-10 కోట్ల ఖర్చవుతుందని మీడియాలో చదివానని కేటీఆర్ తెలిపారు. 'ఈ విచారణ వల్ల రూ.5-10 కోట్ల ప్రజాధనం వృథా అవుతుంది. అవినీతే జరగని ఈ కేసులో అన్ని పైసలు వృథా చేయడం ఎందుకు? ఆ పైసలతోని 500 మంది రైతులకు రుణమాఫీ చేయొచ్చు. దాదాపు 2,500 మంది వృద్ధులకు పింఛన్లు ఇవ్వొచ్చు. ఇంకా ఏమైనా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయవచ్చు' అని హితవు పలికారు. 'రేవంత్‌రెడ్డిగారూ.. మీ మీద ఏసీబీ కేసు ఉన్నది కాబట్టి.. నా మీద ఏసీబీ కేసు పెట్టిండ్రు. మీ మీద ఈడీ కేసు అయ్యింది కాబట్టి.. నామీద ఈడీ కేసు పెట్టిండ్రు. నువ్వంటే అడ్డంగా దొరికినోడివి. నేనంటే ఏ తప్పూ చేయనోడిని కాబట్టి.. ధైర్యంగా కేసులు ఎదుర్కొంటా' అని పేర్కొన్నారు. 'సంక్రాంతి పండగ సందర్భంగా రేవంత్‌రెడ్డికి నేను ఒక ఆఫర్ ఇస్తున్నా. న్యాయమూర్తి ఎవరైనా సరే.. మీడియా సాక్షిగా లై డిటెక్టర్ పరీక్షకు పోదాం. న్యాయమూర్తుల సమక్షంలో మనిద్దరం మీడియా ముందు చర్చ పెడదాం.. మీడియా వాళ్లు ఎన్ని ప్రశ్నలు అడుగుతారో అడగమను. ఫార్ములా ఈ-కార్ రేసు, ఓటుకు నోటు కేసులకు సంబంధించి రేవంత్‌ను, నన్ను ప్రశ్నలు అడగండి. అక్కడే ఇద్దరికీ లై డిటెక్టర్ పరీక్ష పెట్టమంటా. నేను సమాధానం చెప్తా. ఆయన కూడా జవాబు చెప్పాలి. ప్రజలు మొత్తం చూస్తారు.. రూ.50 లక్షలో రూ.20 లక్షలతోనో మొత్తం ఒడిసిపోతుంది. ఎందుకు ఇంత ప్రజాధనం వృథా చేయడం' అని సూచించారు.

8 గంటల పాటు విచారణ

సుమారు 8 గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఈడీ విచారణలో పలు అంశాలకు కేటీఆర్ వివరంగా సమాధానమిచ్చారు. గురువారం ఈడీ విచారణకు ఫార్ములా-ఈ పైన, నీల్సన్ సంస్థ రూపొందించిన నివేదిక, తెలంగాణ ఈవీ పాలసీ -2020కి సంబంధించిన రెండు డాక్యుమెంట్లను ఈడీ అధికారులకు ఇచ్చిన కేటీఆర్.. వారి నుంచి రిసిప్ట్ తీసుకున్నారు. ఫార్ములా ఈ-రేసు అనంతరం స్వతంత్ర సంస్థ నీల్సన్ రూపొందించిన నివేదికను కేటీఆర్ వారికి అందజేశారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు 82 మిలియన్ డాలర్ల మేర ఆర్థిక లబ్ధి జరిగిందని ఆ సంస్థ తెలియజేసిన రిపోర్టును ఈడీ అధికారుల ముందుంచినట్టు తెలిసింది. దీంతోపాటు అప్పటి ప్రభుత్వం 2020 అక్టోబర్‌లో ప్రకటించిన తెలంగాణ ఎలక్ట్రిక్ పాలసీ కాపీని ఈడీ అధికారులకు కేటీఆర్ అందజేశారు. దీని ప్రకారం రాష్ట్రంలో 'తెలంగాణ మొబిలిటీ వ్యాలీ'ని ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ ఇంధన వనరులతోపాటు, మొబిలిటీ రంగంలో తెలంగాణను కేంద్రంగా తీర్చిదిద్దే ఒక గ్రాండ్ విజన్, ఎజెండాతో పెట్టిన పాలసీనే 'తెలంగాణ ఈ-వీ పాలసీ' అని అధికారులకు కేటీఆర్ వివరించినట్టు తెలిసింది. ఈవీ పాలసీ స్ఫూర్తిలో భాగంగానే తెలంగాణలో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ.. ఈవీ రంగంలో పెట్టుబడుల ఆకర్షణ వంటి అంశాలపై దీర్ఘకాల ఎజెండాతో ఈ- రేసును నిర్వహించినట్టు కేటీఆర్ వారికి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఫార్ములా ఈ-రేసుతో రాష్ట్రంతోపాటు దేశానికి కూడా లాభం జరిగిందని, దేశ ప్రతిష్ట పెరిగిందని తెలిపారు. ఈ నేపథ్యంలోనే కేంద్ర మంత్రు లు హర్దీప్‌సింగ్ పురి, నితిన్ గడ్కరీ, అనురాగ్ ఠాకూర్, కిషన్‌రెడ్డి వంటి కేంద్ర మం త్రులు కూడా ఈ-రేసు కార్యక్రమంలో పాల్గొన్నట్టు కేటీఆర్ వివరించారు. కేవలం సాంకేతిక అంశాలు మినహా ఎక్కడా పైసా అవినీతి గాని, మళ్లింపు గాని జరగలేదని వివరించారు. ప్రభుత్వ నిధులు, ఇక్కడి నుంచి ఫార్ములా-ఈ సంస్థకు చేరిన రికార్డుల్లోని లావాదేవీలు చాలా స్పష్టంగా ఉన్నాయని చెప్పారు. ఇక్కడి నుంచి వెళ్లిన డబ్బు మొత్తం.. సంస్థ వద్ద ఉన్నప్పుడు ఇందులో అవినీతి ఎక్కడిదని ప్రస్తావించారు.

న్యాయ వ్యవస్థపై నాకు నమ్మకముంది

'ఇదే కేసు మీద ఎన్నిసార్లు విచారణకు రమ్మన్నా వస్తా. ఎన్ని ప్రశ్నలు అడిగినా సమాధానం చెప్తా. ఎన్ని రకాల పరీక్షలు పెట్టినా భరిస్తా. ఎందుకంటే నిజం, నిజాయితీ అంతిమంగా గెలుస్తుంది. స్థానిక కోర్టులు, హైకోర్టు, సుప్రీంకోర్టు ఉన్నాయి. భారత న్యాయవ్యవస్థ మీద న్యాయమూర్తుల మీద నాకు విశ్వాసం ఉన్నది. ఇవాళ కాకున్నా ఇంకో 4 రోజులకైనా ప్రజలకు పూర్తి వాస్తవాలు తెలుస్తాయన్న విశ్వాసం నాకున్నది' అని కేటీఆర్ మీడియా సాక్షిగా చెప్పారు. తనను చూసేందుకు వచ్చిన కార్యకర్తలు, మద్దతుగా వచ్చిన బీఆర్ఎస్ నాయకులు, మీడియా మిత్రులకు కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. 'నేను తప్పు చేసినట్టు తేలితే నేను ఏ శిక్షకైనా రెడీ' అంటూ మరోసారి తన కేటీఆర్ స్పష్టంచేశారు. 'నేను ఏ తప్పూ చేయలేదు. తప్పు చేయబోను. 8 గంటలు వాళ్లు ఇదే అడిగారు. నేను ఇదే చెప్పాను. ఏసీబీ 80 ప్రశ్నలు, ఈడీ 40కి పైగా ప్రశ్నలు అడిగింది. అన్నింటికీ సమాధానాలు ఇచ్చాను' అని తెలిపారు.

తరలివచ్చిన నేతలు, కార్యకర్తలు

ఉదయం నుంచి సాయంత్రం వరకు బీఆర్ఎస్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, పలు కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్‌కు మద్దతుగా చేరుకొని సంఘీభావం తెలిపారు. వారిలో మాజీ మంత్రులు గంగుల కమలాకర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, తాటికొండ రాజయ్య, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాగంటి గోపీనాథ్, ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, సుంకె రవిశంకర్, బాల్కసుమన్, బాజిరెడ్డి గోవర్ధన్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, దాసోజు శ్రవణ్, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు సాగర్, చిరుమళ్ల రాకేశ్, గజ్జల నగేశ్, ఎర్రోళ్ల శ్రీనివాస్, నాయకులు కిశోర్‌గౌడ్, రాగిడి లక్ష్మారెడ్డి, రంగినేని అభిలాష్, కురవ విజయ్, తుంగబాలు, దాసరి ఉష, రాకేశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఈడీ కార్యాలయం వద్ద పోలీస్ బందోబస్తు

ఈడీ ఆఫీస్ వద్ద ఉద్రిక్తత

- భారీగా పోలీసుల మోహరింపు
- బీఆర్ఎస్ శ్రేణులతో వాగ్వాదం
- ఎక్కడివారిని అక్కడే అడ్డగింత
- పలువురిని అరెస్ట్ చేసిన పోలీసులు

బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్‌ను బలవంతంగా లాక్కెళ్తున్న పోలీసులు

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 16 (నమస్తే తెలంగాణ): ఈడీ ఆఫీస్ వద్ద భారీగా మోహరించిన పోలీసులు, అత్యుత్సాహంతో బీఆర్ఎస్ శ్రేణులపై దురుసుగా ప్రవర్తించడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గురువారం ఉదయం 10.30 గంటలకు బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయం వద్దకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విచారణకు హాజరవుతున్నారనే సమాచారం తెలిసి భారీ సంఖ్యలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలోనే కేటీఆర్ కారు పోలీస్ కంట్రోల్ రూంకు ఎదురుగా రావడంతో రద్దీ మరింతగా పెరిగింది. పోలీసులు ఓవైపు రోడ్డు మూసేసి మరోవైపు రోప్‌ను ఉపయోగించి, కేటీఆర్ కారును ముందుకు పంపించారు. బీఆర్ఎస్ నాయకులు, అభిమానులను ఎక్కడికక్కడే అడ్డుకున్నారు. ఎందుకు తమను అడ్డుకుంటున్నారంటూ పలువురు నాయకులు నిలదీస్తున్నా పోలీసులు పట్టించుకోకుండా ఎక్కడివారిని అక్కడే ఆపేశారు. కొందరు నాయకులు, కార్యకర్తలు ముందుకు దూసుకుపోయేందుకు ప్రయత్నించడంతో పోలీసులతో వాగ్వాదం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని, కేటీఆర్‌కు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన తమపై పోలీసులు ప్రవర్తించిన తీరు సరిగ్గా లేదంటూ పలువురు నాయకులు మండిపడ్డారు. ఈడీ కార్యాలయం వద్ద కొంతసేపు ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనడంతో పలువురు నాయకులను అరెస్ట్ చేసి కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పోలీసుల అదుపులో బీఆర్ఎస్ నేతలు

గచ్చిబౌలిలోని తన నివాసం నుంచి ఉదయం కేటీఆర్ ఈడీ విచారణకు బయలుదేరారని తెలిసిన వెంటనే పలువురు బీఆర్ఎస్ నాయకులు ఈడీ కార్యాలయానికి భారీగా చేరుకున్నారు. దీంతో ఈడీ కార్యాలయం ముందు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సుమారు 400 మంది పోలీసులు మోహరించారు. కేటీఆర్ ఉదయం ఈడీ ఆఫీసుకు వచ్చిన వెంటనే బీఆర్ఎస్ నాయకులు ఆయనకు మద్దతుగా చేరుకున్నారు. అక్కడ ఈ క్రమంలో 'అక్రమ కేసులు పెట్టిన సీఎం డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేస్తూ కొందరు మీడియాతో మాట్లాడే ప్రయత్నం చేశారు. డీసీపీ శిల్పవల్లి, ఏసీపీ సంజయ్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు ఎక్కడివారిని అక్కడే రోప్ పార్టీతో చెదరగొట్టారు. ఈక్రమంలో మీడియాతో మాట్లాడుతూ నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు మన్నె క్రిశాంక్, పల్లె రవికుమార్ గౌడ్, సుమిత్రానంద్, పావనిగౌడ్, కీర్తిలత గౌడ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకొని కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం కేటీఆర్ విచారణ ముగించుకొని వస్తున్న సందర్భంగా మరికొంత మంది కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకొని వ్యాన్లలోకి ఎక్కించారు.

ప్రతీ పైసాకూ లెక్కుంది!

ఒక్క రూపాయి వృథా కాలేదు

హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ లక్ష్యం

ఫార్ములా కార్ రేస్‌పై కేటీఆర్

హైదరాబాద్, జనవరి 16 (నమస్తే తెలంగాణ): 'ఫార్ములా ఈ-రేస్ వ్యవహారంలో ప్రతీ పైసాకూ లెక్క ఉన్నది. ఒక్క రూపాయి కూడా వృథాకాలేదు' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టంచేశారు. ఈ వ్యవహారంలో అవినీతి, మనీలాండరింగ్ ఎక్కడు ఉన్నదని ప్రశ్నించారు. తాను మంత్రిగా ఉన్నా, లేకున్నా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచడమే ప్రధాన లక్ష్యంగా భావిస్తానని తేల్చిచెప్పారు. గురువారం ఫార్ములా ఈ-రేస్ వ్యవహారంపై ఈడీ కార్యాలయానికి వెళ్లే ముందు ఆయన తన ఎక్స్ వేదికగా వివిధ అంశాలను పేర్కొన్నారు. ఫార్ములా ఈ-కార్ రేస్ హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ క్రీడా పటంలో నిలిపిందని గుర్తుచేశారు. అలాంటి గొప్ప పోటీలను నిర్వహించేందుకు విజన్, నిబద్ధత, హైదరాబాద్‌పై అమితమైన ప్రేమ ఉండాలని తెలిపారు. ఫార్ములా ఈ రేస్ పోటీలను తీసుకొచ్చి ప్రపంచపటంలో హైదరాబాద్‌ను నిలపడం మంత్రిగా తాను తీసుకున్న గొప్ప నిర్ణయాల్లో ఒకటిగా నిలుస్తుందని గుర్తుచేశారు. ఈ-రేస్ సందర్భంగా అంతర్జాతీయ రేసర్లు, ఈ-మొబిలిటీ రంగానికి చెందిన ప్రముఖులు హైదరాబాద్ నగరాన్ని ప్రశంసలతో ముంచెత్తిన విషయాన్ని కేటీఆర్ ఉదహరించారు. ఫార్ములా ఈ సంస్థకు రాష్ట్రప్రభుత్వం ఆనాడు పంపిన రూ.46 కోట్ల నగదు అత్యంత పారదర్శకంగా బదిలీ చేసినట్టు కేటీఆర్ తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి రేస్ రద్దుకు తీసుకున్న అసంబద్ధ నిర్ణయం వల్లే రాష్ట్ర ఖజానాకు నష్టం వాటిల్లిందని స్పష్టంచేశారు.

అణచివేతకు కుట్ర

బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్

హైదరాబాద్, జనవరి 16 (నమస్తే తెలంగాణ): ఏసీబీ ముసుగులో రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు, ఈడీ ముసుగులో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కుమ్మక్కై నిత్యం ప్రజాసమస్యలపై ప్రశ్నిస్తున్న కేటీఆర్‌ను అణచివేసేందుకు కుట్రలు చేస్తున్నాయని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ ఆరోపించారు. ఎన్ని కుతంత్రాలకు దిగినా కేటీఆర్ మొన్న ఏసీబీ, నేడు ఈడీ విచారణకు హాజరయ్యారని చెప్పారు. దర్యాప్తు సంస్థల విచారణ తీరు చూస్తుంటే ఇది ముమ్మాటికీ తప్పుడు కేసు అనేది స్పష్టమవుతున్నదని గురువారం 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

ప్రశ్నిస్తున్నందుకే కేసు

బీఆర్ఎస్ నేత విజయ్ కుమార్

హైదరాబాద్, జనవరి 16 (నమస్తే తెలంగాణ): నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్‌కు నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ సీఎం హోదాలో ఈడీ ఆఫీసు ఎదుట ధర్నా చేసిన రేవంత్‌రెడ్డికి.. ఈడీ విచారణకు హాజరైన కేటీఆర్‌కు సంఘీభావం తెలిపేందుకు వెళ్లిన నాయకులను అడ్డుకొనే హక్కు ఎక్కడిదని బీఆర్ఎస్ నేత కురువ విజయ్‌కుమార్ ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని ఈడీ ఆఫీసు వద్ద గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్యాలయం వద్ద శాంతియుతంగా వేచిచూస్తున్న తమపై పోలీసులు దౌర్జన్యానికి దిగారని ఆరోపించారు.

తప్పుడు కేసులతో కేటీఆర్ కీర్తిని తుడిచేయలేరు: యాదయ్యగౌడ్

పదేండ్లు మంత్రి హోదాలో హైదరాబాద్ ఖ్యాతిని పెంచిన కేటీఆర్‌పై కాంగ్రెస్ సర్కారు తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందిపెట్టే ప్రయత్నం చేయడం దుర్మార్గమని సర్పంచుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ మండిపడ్డారు. పనికిమాలిన కేసులతో కేటీఆర్ కీర్తిని చెరిపివేయలేరని ఒక ప్రకటనలో పేర్కొన్నా రు. కక్షలు, కుట్రలను పక్కనబెట్టి పాలనపై దృష్టి పెట్టాలని హితవుపలికారు.

కక్షసాధింపు చర్య

బీఆర్ఎస్ నేతలు పట్లోళ్ల శశిధర్‌రెడ్డి, పడాల సతీశ్

హైదరాబాద్, జనవరి 16 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సంఘీభావం తెలిపేందుకు వెళ్లిన నేతలు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేయడం దుర్మార్గమని మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి మండిపడ్డారు. ఇది నూటికి నూరు శాతం కక్షసాధింపు చర్య అని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అడుగడుగునా ప్రశ్నిస్తున్నందుకు ఏసీబీ, ఈడీ విచారణతో సీఎం రేవంత్‌రెడ్డి వేధిస్తున్నారని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల సతీశ్ విమర్శించారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రభుత్వాన్ని అడుగడుగునా ప్రశ్నిస్తూనే ఉంటామని హెచ్చరించారు.

కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌లో ఉన్న బీఆర్ఎస్ నేతలను పరామర్శిస్తున్న మధుసూదనాచారి

బీఆర్ఎస్ నేతల అరెస్టు

- కేటీఆర్‌కు సంఘీభావంగా వెళ్లిన నాయకులు
- పీఎస్‌లో పరామర్శించిన మధుసూదనాచారి

హైదరాబాద్, జనవరి 16 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం ఈడీ విచారణకు హాజరయ్యారు. ఆయనకు సంఘీభావంగా ఈడీ కార్యాలయానికి వెళ్లిన రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్లు మన్నె క్రిశాంక్, మేడే రాజీవ్‌సాగర్, పల్లె రవికుమార్‌గౌడ్, నేతలు సుమిత్రానంద్, పావనీగౌడ్, కీర్తిలతాగౌడ్, ఖుషీ సమ్ము తదితరులను పోలీసులు అరెస్టు చేసి కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు మధుసూదనాచారి బీఆర్ఎస్ నేతలను పరామర్శించారు.

భావప్రకటన స్వేచ్ఛను హరిస్తున్న సర్కారు : మేడే రాజీవ్‌సాగర్

రాష్ట్ర ప్రభుత్వం భావప్రకటన స్వేచ్ఛను హరిస్తుందని రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్‌సాగర్ తీవ్రంగా విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ నేతలపై రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి సర్కారు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నదని ఆయన దుయ్యబట్టారు. హైదరాబాద్‌లోని కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ నుంచి విడుదల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వాన్ని నిలదీస్తుంటే తట్టుకోలేక కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నదని పేర్కొన్నారు. ఢిల్లీలో ఈడీ కార్యాలయానికి రాహుల్‌గాంధీ కార్యకర్తలతో రావొచ్చుకానీ, కేటీఆర్ విచారణకు హాజరైనప్పుడు తాము వస్తే తప్పేంటని రాజీవ్‌సాగర్ ప్రశ్నించారు.

ప్రజల పక్షాన పోరాడుతున్నందుకే కేసులు

కేటీఆర్‌ను ఇబ్బంది పెట్టేందుకు యత్నం • హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

కరీంనగర్‌లోని ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

కరీంనగర్ కార్పొరేషన్, జనవరి 16: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేక ప్రజల దృష్టి మరల్చేందుకే బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతున్నదని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. హామీలను ఎప్పుడు అమలు చేస్తారని ప్రజల పక్షాన నిలదీస్తున్నందుకే ఎలాంటి అవినీతి లేకున్నా మాజీ మంత్రి కేటీఆర్‌పై తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేయాలని చూస్తున్నారని విమర్శించారు. గురువారం కరీంనగర్‌లోని ఎమ్మెల్యే గంగుల నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ రేస్ విషయంలో ఆనాటి ప్రభుత్వం పంపిన నగదు అందిందని ఫార్ములా రేస్ కంపెనీ కూడా చెప్పిందని తెలిపారు. అసలు అవినీతే జరగనప్పుడు కేసు ఎలా పెడుతారని నిలదీశారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును అరెస్టు చేసి రాష్ట్రాన్ని దోచుకోవాలని రేవంత్‌రెడ్డి చూస్తున్నారని విమర్శించారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కోట్లాది రూపాయలకు అమ్ముడుపోయారని, అందుకే ఏ పార్టీ అని నిలదీశానని పేర్కొన్నారు.

హైదరాబాద్ ఇమేజ్ దెబ్బతీస్తున్న కాంగ్రెస్

ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, జనవరి 16 : అసమర్థ పాలనతో కాంగ్రెస్ సర్కారు తెలంగాణతో పాటు హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతినిందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి విమర్శించారు. గురువారం మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని క్యాంప్ కార్యాలయం లో ఆమె మీడియాతో మాట్లాడారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు, రైతుభరోసా, రూ.4 వేల పెన్షన్, తులం బంగారం అమలు చేయాలని ప్రజలు ఎక్కడ నిలదీస్తారోననే భయంతో కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నదని మండిపడ్డారు. ఈ-కార్ రేస్‌పై అసెంబ్లీ సమావేశాల్లో చర్చిద్దామంటే ప్రభుత్వం పారిపోయిందని, కేటీఆర్‌పై అక్రమంగా ఫార్ములా ఈ-రేసింగ్ కేసు పెట్టారని ధ్వజమెత్తారు.

కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కక్షపూరిత కేసులతో భయపెట్టలేరు

చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కరీంనగర్ కార్పొరేషన్, జనవరి 16: కాంగ్రెస్ ప్రభుత్వం పెడుతున్న కక్షపూరిత కేసులకు బీఆర్ఎస్ నాయకులెవరూ భయపడరని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ స్పష్టం చేశారు. ఫార్ములా ఈ-రేస్‌లో అవినీతి జరగనప్పుడు కేసులు ఎలా పెడుతారని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలుచేయకుండా పక్కదారి పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. గురువారం కరీంనగర్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేటీఆర్‌ను జైలుకు పంపించాలన్న కుట్రతోనే తప్పుడు కేసులు పెడుతున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి జగిత్యాల ఎమ్మెల్యేను ఏ పార్టీలో ఉన్నావని అడిగినందుకే కేసులు పెడుతారా? అని ప్రశ్నించారు.

పగలు కాంగ్రెస్, రాత్రి బీజేపీ

మొదటిపేజీ తరువాయి...

చేయాలని అంటున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులు ఏసీబీని ప్రభావితం చేస్తున్నారా? ఆదేశాలు ఇస్తున్నారా? అని నిలదీశారు. కాంగ్రెస్ నాయకులు మాట్లాడిన దారిలోనే బీజేపీ నేతలు కూడా కేటీఆర్‌ను అరెస్ట్ చేయాలని అనడం వెనుక మతలబు ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణభవన్‌లో గురువారం ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, జాజుల సురేందర్, జడ్పీ మాజీ చైర్మన్లు టీ రాజు, దాదన్నగారి విఠల్‌రావు, నాయకులు కురవ విజయ్‌కుమార్, సత్యనారాయణరావుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, బీజేపీ ఎంపీలు ఈడీని ప్రభావితం చేస్తున్నారా? అని నిలదీశారు. రేవంత్‌రెడ్డి పగలు కాంగ్రెస్‌తో, రాత్రి బీజేపీతో బంధం కొనసాగిస్తున్నారని ఎద్దేవాచేశారు. బీజేపీ కార్యాలయంపై దాడి విషయంలో వెంటనే స్పందించిన పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, భువనగిరిలోని బీఆర్ఎస్ కార్యాలయాలపై దాడుల గురించి ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు.

ఢిల్లీలోనూ అవే అబద్ధాలు

మహారాష్ట్ర ఎన్నికల సందర్భంగా చెప్పిన అబద్ధాలనే ఢిల్లీలోనూ సీఎం రేవంత్‌రెడ్డి చెప్పున్నారని, మహారాష్ట్ర తరహాలోనే ఢిల్లీలోనూ కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదని వేముల ప్రశాంత్‌రెడ్డి హెచ్చరించారు. వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామన్న రేవంత్‌రెడ్డి.. 400 రోజులైనా నెరవేర్చలేదని, మహారాష్ట్ర ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి చెప్పిన మాటలను ప్రజలు నమ్మలేదని, అందుకే ఆయన ప్రచారం చేసిన అన్ని స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఓడిపోయారని గుర్తుచేశారు. గతంలో సోనియాగాంధీని తెలంగాణ బలిదేవత అన్న రేవంత్‌రెడ్డి, నేడు అదే నోటితో ఆమెను గొప్ప నాయకురాలని ప్రశంసిస్తున్నారని వేముల మండిపడ్డారు. రాహుల్‌గాంధీ నాలుగు నెలలుగా అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని, రాహుల్ దృష్టిలో పడేందుకే ఇవాళ రేవంత్ సోనియాను పొగుడుతున్నారని ఎద్దేవా చేశారు.

చట్ట పరిధిలోనే పోలీసులు పనిచేయాలి

చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా, బాధ్యత గల నాయకుడిగా కేటీఆర్ గతంలో ఏసీబీ, నేడు ఈడీ విచారణకు హాజరయ్యారని వేముల చెప్పారు. ఫార్ములా ఈ-కార్ రేస్ కేసు కేటీఆర్‌పై రేవంత్‌రెడ్డి కక్షతో పెట్టిన అక్రమ కేసని, ఇందులో నయా పైసా అవినీతి జరగలేదని కేటీఆర్ మొదట్నుంచీ చెప్తున్నారని అన్నారు. అక్రమ కేసులతో ఇబ్బంది పెట్టినా, విచారణ సంస్థలకు కేటీఆర్ పూర్తి సహకారం అందిస్తున్నారని గ